

మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- కొండపోలవలసలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జలుమూరు: ఏడాది కాలంగా ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. మండలంలో కొండపోలవలసలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మండల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబుకు మోసం చేయడం, అబద్ధాలు చెప్పడం వెన్నతోపెట్టిన విద్య అన్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రశ్నించినవారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందేవని గుర్తు చేశారు. అర్హతే ప్రమాణికంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేశామని వెల్లడించారు. కానీ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి, దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు కష్టాలు పడుతుంటే.. కూటమి నాయకులు, కార్యకర్తలు ఇసుక, మద్యం అమ్మకాలతో లాభపడుతున్నారన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఏడాది కాలంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మీద కూటమి ప్రభుత్వం అనేక దాడులు చేస్తోందని, వీటిని తిరిగి వడ్డీతో చెల్లించే రోజు దగ్గరలో ఉందని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అనునిత్యం అండగా ఉంటామని తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పక్కాగా ఘన విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.శ్యామలరావు, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు దామ మన్మథరావు, బూత్ కమిటీ అధ్యక్షుడు ధర్మాన జగన్, మహిళా విభాగ అధ్యక్షురాలు జీవి రమణి, వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, సీనియర్ నాయకులు బుక్కా లక్ష్మణరావు, తండ్యేల జగన్నాథరావు, చల్లవానిపేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాజప్పలనాయుడు, పైడి విఠలరావు, యువజన నాయుకులు నేతాజీ, హరిప్రసాద్, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హామీల అమలులో కూటమి విఫలం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- చిన్నకొల్లివలసలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'

హిరమండలం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి విమర్శించారు. ఎల్ఎన్‌పేట మండలంలోని చిన్నకొల్లివలస గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన కూటమి నాయకులు ఒక బాండు చేతులో పెట్టి, ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందని ప్రచారం చేశారని గుర్తు చేశారు. వారు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు, అధికారం చేపట్టి ఏడాది దాటుతున్నా అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.



మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు

వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని పేర్కొన్నారు. ఓట్లు, అధికారం కోసం ఎంతవరకైనా దిగుజారుతారని దయ్యబట్టారు. అధికారం చేపట్టిన దగ్గర నుంచి ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రక్తపాతం సృష్టించారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం నడుస్తున్న అరాచక పాలనతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనబెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తుండడం విచారకరమన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించడమే కాకుండా, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడదామని పిలుపునిచ్చారు.



క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి రామారావు, శిమ్మ సాంబశివరావు, ఈగల చిన్నారావు, కొల్ల కృష్ణ, లోచర్ల మల్లేశ్వరరావు, లుకలాపు సుధీర్, ముగడ జనార్ధరావు, యోగేశ్వరరావు, పల్లి జయలక్ష్మి, బలగ గోవిందరావు, బొడ్డేపల్లి భాస్కరరావు, మీసాల రామకృష్ణ, మామిడి గంగాధర్‌రావు, చింతాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఏడాది పాలన మోసాలమయం

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవి
- పొందూరులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'

పొందూరు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనంతా మోసాలమయమని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవి అన్నారు. మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండల విస్తృత స్థాయి సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ, అధికారం చేపట్టిన తర్వాత గాలిలో కలిసిపోయాయని ఎద్దేవా చేశారు. కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హమీలు అమలు చేసేవరకు వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందని తెలియజేశారు. నిరుద్యోగ యువత, ఆడబిడ్డలు, రైతులను మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. ఏడాదిగా పింఛన్ల కోసం వితంతువులు, వృద్ధులు ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అన్నదాత సుఖీభవ, వితంతువులకు పింఛన్లు ఇస్తామని జీవో విడుదల చేసి చేతులు దులుపుకున్నారే తప్ప, ఇప్పటివరకు ఎవరికీ ఒక్క పింఛన్ కూడా అందలేదని దుయ్యబట్టారు.

ప్రజలు తిరగబడుతున్నారు

సుపరిపాలన పేరుతో కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోకి వెళ్తుంటే ప్రజలు తిరగబడుతున్నారని పేర్కొన్నారు. చిరుద్యోగులను తీసేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, సీఎఫ్‌లు, డీలర్లు, గ్రీన్ అంబాసీడర్లు తదితర చిరుద్యోగులను కూటమి ప్రభుత్వం అకారణంగా తొలగించడం అన్యాయమన్నారు. రానున్న 2029 ఎన్నికల్లో లోకేష్, చంద్రబాబు ఖచ్చితంగా పారిపోవాల్సిందేనన్నారు. ఆమదాలవలస నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ చెప్పారని, కానీ కనీసం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించలేకపోతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీని దేశంలోనే బలమైన క్యాడర్ ఉన్న పార్టీగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందిస్తున్నారన్నారు. సుమారు 18 లక్షల మంది కార్యవర్గాన్ని తయారు చేసే పనిలో ఉన్నారని తెలియజేశారు.



క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, నాయకులు గాడు నాగరాజు, బొడ్డేపల్లి పద్మజ, వండాన వెంకటరావు, గంట్యాడ రమేష్, పప్పల రాధాకృష్ణ, గుడ్ల మోహన్, పీరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసిన దృశ్యం

మెళియాపుట్టి: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించాలని విశాఖ జిల్లా గంట్యాడ రిజిస్ట్రార్ కంచరాన రోహన్ కుమార్, ఆయన భార్య ఝాన్సీ అన్నారు. శుక్రవారం కరజాడ జిల్లా పరిషత్ పాఠశాలలో విశ్రాంత లెక్చరర్ దుప్పల ఆంజనేయమూర్తి(రోహన్ కుమార్ మామయ్య) వర్ధంతిని పురస్కరించుకుని గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన బగాతి మహి, రాయపల్లి రాకేష్, గేదెల హరికృష్ణలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు తాగునీటి సౌకర్యం కోసం రూ.40,000 వితరణగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బమ్మిడి పున్నయ్య, పీఎంసీ చైర్‌పర్సన్ జోగ హేమలత, హనుమంతు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గిరిజన విద్యార్థినికి ప్రోత్సాహకం



నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న రాజేశ్వరరావు

పాతపట్నం: మండలంలోని పెద్దలోగిడి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని బొబ్బిలి శ్రీదేవి ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చింది. దీంతో ఆమెకు అదే గ్రామానికి చెందిన విశ్రాంత పంచాయతీ సెక్రటరీ, సామాజికవేత్త బైపోతు రాజేశ్వరరావు రూ.5 వేల నగదు ప్రోత్సాహకం శుక్రవారం అందజేశారు. విద్యార్థిని భవిష్యత్‌లో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు వితరణ



భోజనం ప్లేట్లు అందజేస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాలలో ఆ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థిని మద్ది శ్రీవాణి తరుపున ఆమె తండ్రి విద్యార్థులకు భోజనపు ప్లేట్లను వితరణగా శుక్రవారం అందజేశారు. పాఠశాల డైరెక్టర్ మోహన్ గాంధీకి 60 మంది విద్యార్థులకు సరిపడా ప్లేట్లను అందించారు.

సర్వసభ్య సమావేశం నేడు

కొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవర సావిత్ర అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరవ్వాలని కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి వివరాలతో రావాలన్నారు.

శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస: ఆదివాసీ మహిళలు ఆర్థిక స్వావలంబనకు కేవీకేలో అందించే శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక కేవీకేలో ఆర్ప్ స్వచ్ఛంద సంస్థ, మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ నాబార్డు, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై గిరిజన యువతకు గత కొన్ని రోజులుగా అందిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో శిక్షణ చివరి రోజున పైనాపిల్ స్క్వాష్, పైనాపిల్ జామ్, పైనాపిల్ క్యాండీ తయారీపై చర్చించారు. నాబార్డు జిల్లా డవలప్‌మెంట్ మేనేజర్ కె.రమేష్ కృష్ణ మాట్లాడుతూ ఆదివాసీ యువత ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ప్ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ ఎస్.అనూప్, మన్యం సహజ ఉత్పత్తిదారుల సంఘం సీఈవో బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



యువతకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు

- డిప్యూటీ ఈవో విజయకుమారి

పొందూరు: మండలంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఈవో విజయకుమారి సూచించారు. స్థానిక మండల వనరుల కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొమ్మిది మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 45లోపు విద్యార్థుల సంఖ్య ఉండడం దారుణమన్నారు. నిబంధనల మేరకు కచ్చితంగా కనీసం 45 మంది విద్యార్థులు ఉండాలని స్పష్టం చేశారు. ఒకప్పుడు విద్యా చరిత్రలో సముచిత స్థానం పొందిన స్థానిక రెండో నంబర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించినట్లు ఎంఈవోలు జి.శ్రీరాములు, పి.రాజారావు తెలియజేశారు. అలాగే మూడో నంబర్ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను నాలుగో నంబర్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డిప్యూటీ ఈవో సందర్శించారు.



ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో విజయకుమారి

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నేడు

సారవకోట: మండలంలో అలుదు గ్రామంలోని వీబీఆర్ కన్వెన్షన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమ నిర్వహణపై పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య శుక్రవారం స్థానిక పార్టీ నాయకులతో సమీక్షించారు. కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరవ్వనున్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఆమదాలవలస: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనిలో భాగంగా బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంపై చర్చించడం జరుగుతుందన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరవ్వాలని కోరారు. అలాగే పార్టీ నూతన కార్యవర్గం సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు.

21 నుంచి సమావేశాలు

నరసన్నపేట: మండలంలో ఈనెల 21వ తేదీ నుంచి పంచాయతీ స్థాయిలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఆరంగి మురళి, మాజీ జెడ్పీటీసీ చింతు రామారావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 21న లుకలాం, ముషిడిగట్టు, కొత్తపోలవలస, కామేశ్వరిపేట, 22న నడగాం, చోడవరం, కొబగాం, 23న తెలగవలస, చెన్నాపురం, పారశిల్లి, 24న మడపాం, పోతయ్యవలస, గోపాలపెంట, 25న రావులవలస, చిన్న బొరిగివలస, పెద్ద బొరిగివలస, 26న గొట్టిపల్లి, దూకులపాడు, 27న సుందరాపురం, బాడాం, చిక్కాలవలస, 28న దేవాది, కిల్లాం, మాకివలస, 29న బాలసీమ, ఉర్లాం, 30న కంబకాయ, కరగాం, 31న జమ్ము, తామరాపల్లి, ఆగస్టు 1వ తేదీన యారబాబు, వీఎన్‌పురం, కోమర్తి, 2 నుంచి 4వ తేదీ వరకు నరసన్నపేట టౌన్‌లో సమావేశాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆయా తేదీల్లో పంచాయతీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు అందుబాటులో ఉండాలని కోరారు.

సేంద్రియ పద్ధతిలో శుద్ధి చేసుకోవాలి

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి విత్తనాలను రైతులు శుద్ధి చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీ ఎస్.వెంకటరావు సూచించారు. మండలంలోని కొమ్ములగూడ, బుర్జగూడ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ పంటల్లో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై గిరిజనులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కో–ఆర్డినేటర్ నేతాజీ మాట్లాడుతూ రైతులు విత్తన శుద్ధి, లీఫ్ క్లిప్పింగ్, లైన్ సోయింగ్ వంటి విధానాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైబ్స్ సభ్యుడు జి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

హిరమండలం: మండలంలోని కోవిలాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల లక్ష్మణరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి శుక్రవారం పరామర్శించారు. అలాగే మండలంలోని శ్యామలాపురం గ్రామంలో ఇటీవల పాటుకాటుకు గురై మృతి చెందిన ఇప్పిలి జగదీశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆమెతో పాటు ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, నాయకులు కెల్ల గణపతిరావు, రెడ్డి రామారావు, ఈగల చిన్నారావు, కొల్ల కృష్ణ, లక్ష్మనాయుడు తదితరులు ఉన్నారు.



లక్ష్మణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్డి శాంతి తదితరులు

ఇసుక లారీలతో ఇబ్బందులు



రహదారి మధ్య నిలిచిపోయిన వాహనాలు

బూర్జ: మండలంలోని కొల్లివలస – నారాయణపురం గ్రామాల మధ్య ఇసుక లారీలు, ట్రిప్పర్లతో వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం కాఖండ్యాం ఇసుక ర్యాంపు, తమరాం ఇసుక ర్యాంపు నుంచి భారీగా వాహనాలు వచ్చాయి. అయితే ఇసుక లారీలు చీడివలస – నారాయణపురం గ్రామాలకు మధ్యలో దిగబడిపోయి నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అనంతరం జేసీబీతో ముందుకు లాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎరువుల దుకాణంలో తనిఖీలు



తనిఖీలు చేపడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కొత్తూరు: మండల కేంద్రంలోని గుడ్ల కృష్ణారావు అనే డీలర్‌కు సంబంధించిన ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీఏ బి.విజయప్రసాద్, సీఐ సతీష్‌లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 46.5 మెట్రిక్ టన్నుల ఎరువులకు సంబంధించిన సుమారు రూ.12 లక్షలకు సంబంధించి రశీదులు సాంకేతిక కారణాలు వలన సక్రమంగా లేకపోవడం గుర్తించామని తెలిపారు. రశీదుల తేడా సరిచేసేంత వరకు ఎరువుల విక్రయాలు నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ ఎరువుల కొరత సృష్టించినా దుకాణదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎరువులు అక్రమంగా తరలించినా, అనుమతులు లేని చోట నిల్వ చేసినా ఇబ్బందులు తప్పవన్నారు. వారితో పాటు స్థానిక ఏవో స్వర్ణలత, జిల్లా కార్యాలయం నుంచి ఏడీఏ వెంకటరావు, ఏఈవో సంతోష్ తదితరులు ఉన్నారు.

అభినందనలు

సరుబుజ్జిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సరుబుజ్జిలి జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు నియామకం హర్షణీయమని ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఈ మేరకు పార్టీ నాయకులతో నాగేశ్వరరావు స్వగ్రామం కొత్తకోటలో ఆయనను శుక్రవారం కలిసి అభినందించారు. నిజాయితీ, అనుభవానికి తగిన గుర్తింపునిచ్చిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు సరుబుజ్జిలి, బూర్జ మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, ఖండాపు గోవిందరావు, పున్నపురెడ్డి తవిటినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, పార్టీ జిల్లా బీసీసెల్ కన్వీనర్ మూడడ్ల రమణ, బొడ్డేపల్లి నాగరాజు, నారాయణమూర్తి, ఎడ్ల ఈశ్వరరావు, బద్రి రామారావు, సురవరపు తిరుపతి, ప్రకాశ్, రామకృష్ణ, వండాన కృష్ణ, అదపాక గౌరినాయుడు తదితరులు ఉన్నారు.



నాగేశ్వరరావుని అభినందిస్తున్న రవికుమార్ తదితరులు

ఎరువుల పంపిణీలో అధికారులు విఫలం

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు

సరుబుజ్జిలి: రైతులకు అవసరమైన ఎరువులు అందించడంలో సంబంధిత అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కేవీజీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చర్చ నిర్వహించారు. భూముల రీ సర్వేలో లోపం వలన తల్లికి వందనం పథకానికి అనేక మంది విద్యార్థులు దూరమైనట్లు రావివలస సర్పంచ్ వండాన కృష్ణ అధికారులకు ఫిర్యాదు చేశారు. అన్నదాత సుఖీభవ నమోదులో అధికారులు సక్రమంగా వ్యవహరించలేదని, నాడు – నేడు బిల్డింగ్‌లకు సంబంధించిన పెయింట్లు వేయకుండా గదుల్లో ఉంచడం వలన పాడవుతున్నాయని రొట్టవలస సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు వేలిముద్రలు తీసుకొని రేషన్ సరుకులు మాత్రం డోర్ డెలవరీ చేయడం లేదని, వ్యాసులుపేట గ్రామస్తులకు రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదని సభ్యులు ఫిర్యాదు చేశారు.

రహదారులు ఎప్పుడు పూర్తి చేస్తారు..?

పురుషోత్తపురం, కొండవలస రహదారి పనులు ఎందుకు పూర్తి చేయలేదని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఉపాధి హామీ మొక్కలు నాటినా జీవించడం లేదని, మెట్ల నియామకంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని దకరవలస సర్పంచ్ సురవరపు తిరుపతిరావు ప్రశ్నించారు. కొత్తకోట సహకార సంఘంలో బినామీ రుణాలతో పాటు, రుణాలు చెల్లించిన రైతులకు రశీదులు సక్రమంగా అందించడం లేదని, చనిపోయిన రైతుల పేరుమీదుగా రుణాలు రీ షెడ్యూల్ చేస్తున్నారని కొండవలస సర్పంచ్ లావేటి విశ్వేశ్వరరావు ఆరోపించారు. విలేజ్ హెల్త్ క్లీనిక్స్‌లో మందులు అందుబాటులో ఉండడం లేదని, కొత్తకోట గ్రామానికి విద్యుత్ లైన్‌మెన్ లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయని జెడ్పీటీసీ నాగేశ్వరరావు అధికారులు దృష్టికి తెచ్చారు. అధికారులు సమస్యలపై సక్రమంగా స్పందించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జీవీ శివానందమూర్తి, ఎంపీడీవో ఎం.పావని, తహసీల్దార్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

అంగన్‌వాడీల ధర్నా నోటీసు

కొత్తూరు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21వ తేదీన ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు సీడీపీవో పి.లక్ష్మీబాయికి స్థానిక అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం నోటీసు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ కార్యకర్తల ఫేస్ రికగ్నైజెడ్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. గర్భిణులు, బాలింతలకు ఒకే యాప్ ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం నాయకులు కేవీ హేమలత, కె.లక్ష్మి, ధనలక్ష్మి, అనురాధ, నీరజ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు..



సీడీపీవోకు నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

పూడిక తీత పనులు

బూర్జ: మండలంలోని పెద్దపేట పంచాయతీ బొమ్మిక రిజర్వాయర్ కాలువలో పూడిక తీత పనులు, మదుములు మరమ్మతులను రూ.4 లక్షలతో చేపట్టనున్నట్లు ఏఈ కె.దాలయ్య తెలియజేశారు. శుక్రవారం ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

పారిశుద్ధ్య పనులు

కొత్తూరు: మండలంలోని పొనుటూరు గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ ఎద్దు చామంతి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు శుక్రవారం చేపట్టారు. కాలువలు, రోడ్డు మీద పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలియజేశారు. ప్రజలంతా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.